# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రైతుల సాధికారతే లక్ష్యంగా నూతన సాంకేతికతలతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2** **రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**

**3.** **రాజధాని అమరావతిలో ఐఐటీ నిపుణుల బృందం పర్యటన రెండవరోజు కొనసాగుతోంది.**

**4** **జువ్వలదిన్నె మత్స్య హార్బర్‌ను పూర్తి చేసి త్వరలో మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.**

**5** **నాగపూర్ రైల్వే డివిజన్‌లో ట్రాక్ మరమ్మత్తుల దృష్ట్యా పలు రైళ్లను విజయవాడ మీదుగా దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.**

==========================

రైతుల సాధికారతే లక్ష్యంగా నూతన సాంకేతికతలతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. 32వ అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తల సమావేశాన్ని ఈరోజు ఢిల్లీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, రసాయన రహిత సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. సాంప్రదాయ వ్యవసాయాన్ని సౌర శక్తి వంటి సాంకేతికతలతో అనుసంధానించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధానమంత్రి వివరిస్తూ,

వాయిస్ (34 ... సెకన్లు)

ఇలావుండగా సుస్థిరమైన వ్యవసాయ ఆధారిత ఆహార వ్యవస్థ దిశగా పరివర్తన అనే ఇతివృత్తంతో అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్తల సంఘం 6 రోజుల పాటు ఈ త్రైవార్షిక సమావేశాన్ని నిర్వహిస్తోంది. వాతావరణ మార్పు, ప్రకృతి వనరుల క్షీణత, పెరుగుతున్న ఉత్పత్తి ధరలు, ఘర్షణల వంటి భౌగోళిక సవాళ్లను ఎదుర్కొవడంలో సుస్థిరమైన వ్యవసాయ ప్రాధాన్యత తెలిపే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

--------------------------

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఆర్టీసీ బస్సు

డిపోలో 25 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించి, వారికి మెరుగైన సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆర్టీసీలో ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని, దూర ప్రాంతాలకు నడిచే బస్సుల సంఖ్య పెంచుతామని చెప్పారు.

-----------------------------

రాజధాని అమరావతిలో ఐఐటీ నిపుణుల బృందం పర్యటన రెండవరోజు కొనసాగుతోంది. ఇందులో భాగంగా రాజధానిలో పర్యటిస్తున్న ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం సచివాలయం, శాఖావిభాగాధిపతుల భవనాలు, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నిర్మాణాల పటిష్టతపై అధ్యయనం చేస్తున్నారు. అలాగే ఐకానిక్ టవర్ల వద్ద రాఫ్ట్ పునాదిని పరిశీలించారు. ఇలా ఉండగా... నిన్న హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందం అమరావతిలోని శాసనసభ్యుల భవన సముదాయాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఐఐటీ బృంద సభ్యులు సుబ్రహ్మణ్యం, మున్వర్ బాషా పాత్రికేయులతో మాట్లాడుతూ, భవనాల పటిష్ఠత, సామర్థ్యం నిర్ధారణకు మరికొంత సమయం పడుతుందన్నారు. సాంకేతికంగా వాటిని పూర్తిగా పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

-----------------------------

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బరు 6 నెలల్లోగా పూర్తి చేసి మత్స్యకారులకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి నిన్న ఆయన జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మారిటైం బోర్డు అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్లతో పాటు దామవరం విమానాశ్రయాన్ని కూడా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అలాగే, జూన్ 2025 లోపు రామాయపట్నం పోర్టు నిర్మాణం పూర్తి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు.

-----------------------------

నాగపూర్ రైల్వే డివిజన్‌లో ట్రాక్ మరమ్మత్తుల దృష్ట్యా పలు రైళ్లను విజయవాడ, నాగ్‌పూర్ మీదగా దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం-హజ్రత్ నిజాముద్దీన్ రైలును ఈ నెల 6, 10, 11, 12, 13, 14, 15, 18 తేదీల్లో దారి మళ్లించారు. ఎర్నాకుళం-బిలాస్‌పూర్ ను ఈ నెల 12, 14 తేదీల్లో, ఎల్‌టీటీ ముంబయి-విశాఖపట్నం రైలును ఈ నెల 18, 20 తేదీల్లో దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. అలాగే సికింద్రాబాద్-రాయ్‌పూర్ 7, 8, 14, 15 తేదీల్లో, నాందెడ్-సంత్రాగచి రైళ్లను ఈ నెల 12,14 తేదీల్లో పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

-----------------------------

ప్యారిస్ లో జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడల్లో ఈరోజు భారత క్రీడాకారులు షూటింగ్, విలువిద్య, బాక్సింగ్, సెయిలింగ్, గోల్ఫ్ విభాగాల్లో పోటీ పడతారు. షూటింగ్‌లో ఇప్పటికే దేశానికి రెండు పతకాలు సాధించిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన మనుభాకర్ ఈ రోజు మహిళల 25 మీటర్ల పోటీలో మూడో పతకం సాధించడానికి సంసిద్ధమయ్యారు. విలువిద్య రౌండ్ 16లో దీపికా కుమారి, భజన్ కౌర్ జర్మనీ, ఇండోనేషియాకు చెందిన క్రీడాకారులతో పోటీ పడతారు. కాగా బాక్సింగ్ పురుషుల 71 కిలోల విభాగంలో నిషాంత్ దేవ్, అలాగే గోల్ఫ్‌లో

శుభాంకర్ శర్మ, గగన్ జిత్ భుల్లార్‌లు, సెయిలింగ్ పురుషుల విభాగంలో విష్ణుశర్వనన్ పతకాల కోసం పోటీ పడతారు.

---------------------------

బిడ్డ ఎదుగుదలకు పోషకాలతో కూడిన తల్లిపాలు అత్యంత అవసరమని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిన్న కలెక్టర్ కార్యాలయంలో వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎటువంటి అంటువ్యాధులు సంభవించకుండా ఉంటాయన్నారు. తల్లిపాలలో ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

జాతీయ అవయవదాన అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని ఈరోజు నిర్వహించారు. స్విమ్స్‌లోని పద్మావతి ఆసుపత్రి నుంచి వాల్మీకి సర్కిల్ వరకు కొనసాగిన ర్యాలీని స్విమ్స్ డైరెక్టర్ ఆర్.వి.కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో అవయవదానం చేసే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందని పేర్కొంటూ......

.....వాయిస్....38 సెకన్లు....

---------------------------

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా నూజివీడులో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని మంత్రి నిన్న ఆకస్మికంగా తనిఖీ చేసి మౌలిక వసతులను పరిశీలించారు. వసతి గృహంలో వసతుల వివరాలు సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనును వసతి గృహాలలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. బాలికలకు కావలసిన ముఖ్యమైన వసతులు తక్షణమే కల్పించాలని అధికారులకు సూచించారు. బాలికల వసతిగృహంలో అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

ఎన్టీఆర్ జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. నిన్న విజయవాడలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, రహదారి భద్రత ఉల్లంఘనలపై చర్యలు, మోటార్ యాక్సిడెంట్ స్కీమ్-2022 అమలు, సురక్షిత రవాణా ప్రణాళిక, రహదారి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్ ప్రాంతాలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని అన్నారు.

=====================